ప్రైవేట్‌కు దీటుగా బీఎస్ఎన్ఎల్

- సేవలు మరింత విస్తృతం చేసిన ప్రభుత్వ రంగ సంస్థ
- త్వరలో అందుబాటులోకి రానున్న 4 జీ
- రీచార్జ్ ప్లాన్లు తక్కువగా ఉండటంతో వినియోగదారుల ఆసక్తి





హిందూపురం: ప్రభుత్వ టెలికం సంస్థ భారత సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త టెక్నాలజీతో వినియోగదారులకు చేరువవుతోంది. ప్రైవేట్ టెలికం సంస్థలు మారుమూల గ్రామాలకు సేవలను విస్తరించలేకపోతుండగా.. బీఎస్ఎన్ఎల్ మాత్రం సేవలను విస్తృతం చేస్తోంది. ప్రైవేట్‌కు ధీటుగా 4 జీ సేవలను త్వరలో రానున్నాయి. దీనికి తోడు ప్రైవేటు నెట్‌వర్క్‌కు సంబంధించి రీచార్జ్ ధరలు పెరగడం వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

రెండు నెలల్లో 4 జీ సేవలు

జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరో రెండు నెలల్లో 4జీ సేవలు అందుబాటులోకి తెస్తామని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. జిల్లాలోని ప్రధాన కేంద్రాలు పుట్టపర్తి, కదిరి, .ధర్మవరం, హిందూపురం, మడకశిరతో పాటు మరిన్ని ప్రాంతాల్లో 4జీ సేవలు అందుబాటులో రానున్నాయి. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ సంస్థకు జిల్లాలో ప్రధాన కేంద్రాల్లో 556 సెల్ టవర్లు ఉన్నాయి. కొత్తగా మరో 65 టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. అందులోనూ ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయి. మరో మూడునెలల్లో టవర్ల సామర్థ్యం పెంపొందించనుండటంతో బీఎస్ఎన్ఎల్ బెస్ట్ నెట్‌వర్క్‌గా అవతరించనుంది.

తక్కువ ధరకే రీచార్జ్ ప్లాన్లు

జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ నెట్‌వర్క్‌లు తమ రీచార్జ్ ప్లాన్లను రెండు నెలల క్రితమే అధికంగా పెంచేశాయి. మరోవైపు బీఎస్ఎన్ఎల్ మాత్రం వినియోగదారులకు మరింత చేరువయ్యేలా తమ రీచార్జ్ ప్లాన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. తక్కువ ధరకే సంవత్సరం, మూడు నెలలు, నెలవారీ రీచార్జ్ ప్లాన్లు ఉండటంతో అధిక శాతం మంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అవుతున్నారు. ఇందులో భాగంగానే 4జీ సిమ్‌ల కోసం బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం ఖాయమని వినియోగదారులు చెబుతున్నారు.

మై బీఎస్ఎన్ఎల్ యాప్‌తో విశిష్ట సేవలు

మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా ఆ సంస్థ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలని విస్తృత ప్రచారం కూడా చేస్తోంది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా మై బీఎస్ఎన్ఎల్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత మెయిల్ లేదా రిజిస్టర్ మొబైల్ ద్వారా యూజర్ నేమ్ పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి. అనంతరం ఆ సంస్థ అందించే అన్ని సేవలను పొందచ్చు. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ బిల్లు చెల్లించాలంటే ఆఫీసు వద్ద క్యూలైన్‌లో గంటల తరబడి నిల్చొనే పరిస్థితి ఉండేది. ఇప్పుడు బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ల్యాండ్, మొబైల్ పోస్ట్ పేయిడ్, ఇంటర్నెట్ బిల్లులు యాప్ ద్వారా నిమిషాల్లో చెల్లించవచ్చు. అలాగు మనకు నచ్చిన రీచార్జ్ ప్లాన్లను కూడా చేసుకోవచ్చు. దీనికితోడు మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా దేశం మొత్తం మీద అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలను తెలుసుకోవచ్చు. తద్వారా మనకు కావాల్సిన నంబర్‌ను ఎంచుకుని సొంతంగా ఎంచుకోవచ్చు. బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్లు ఎంపిక చేసుకుని మన మొబైల్ నెంబర్ ఇస్తే ఎస్ఎంఎస్ ద్వారా పిన్ నెంబర్ వస్తుంది. ఆ నంబరుకు 40 గంటలకు పాటు రిజర్వ్ చేసి ఉంచుతారు. ఈలోగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లి నంబర్‌ను సొంతం చేసుకోవచ్చు. అలాగే బీఎస్ఎన్ఎల్ సేవల సంబంధించి ఫిర్యాదులను వినియోగదాలను యాప్‌లోని కంప్లైంట్ అనే ఆప్షన్ ద్వారా తెలియజేయవచ్చు. తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. కొత్త ల్యాండ్ లైన్ ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



ప్రైవేట్ టెలికాం నెట్‌వర్క్‌లకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగానే సేవలను మరింతగా విస్తరిస్తున్నాం. 4జీ నెట్‌వర్క్ సేవలు అతి త్వరలో అందుబాటులో తెస్తాము. మై బీఎస్ఎన్ఎల్ యాప్ ద్వారా టెలికాం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు నెట్‌వర్క్‌ల కన్నా రీచార్జ్ ప్లాన్లు కూడా అందుబాటు ధరలలో ఉండటంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా నాణ్యమైన సేవలను అందిస్తాము.

– హరినాథ్ బాబు, ఎస్‌డీఈ, బీఎస్ఎన్ఎల్, హిందూపురం

రుచికరమైన భోజనాన్ని వడ్డించండి



విద్యార్థులతో కలిసి భోజనం రుచిచూసున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు రుచికమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కాకి ఉన్నత, ఎల్‌కేపల్లి, కాకి ఎస్సీ కాలనీ తదితర ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఎండీఎం నిర్వాహకులు తప్పనిసరిగా మెను ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ మీట్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

హిందూపురం: 'పట్టణ ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా ఉన్న మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మూడు నెలలైనా ఏర్పాటు చేయడం లేదు. వెంటనే కౌన్సిల్ మీట్‌ను ఏర్పాటు చేయండి' అని మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లాతో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. మూడునెలలుగా వివిధ వార్డుల్లో ప్రజలు నీటి ఎద్దడి, పారిశుధ్యం, వీధిలైట్లు, రహదారుల పునరుద్ధరణ తదితర సమస్యల పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, ముస్తక్, రోషన్‌వలి, షాజియా, నాగరాజు, చంద్రశేఖర్, దాదు, సీఎస్‌పీ నాగరాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలని నిరసన



ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ సర్కిల్ నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ హిందూపురంలో ఈఎస్ఐ ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు ఉండాల్సిన చోట కేవలం ఒక డాక్టర్ మాత్రమే డిప్యూటేషన్ మీద ఇక్కడికి వస్తున్నారన్నారు. 11 మంది సిబ్బంది అవసరం ఉండగా.. కేవలం కేవలం నలుగురు మాత్రమే ఉండడంతో కార్మికులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారుతీరెడ్డి, సమీవుల్లా, కమల్‌బాషా, శివప్ప, నరసింహులు, సురేష్, ముత్యాలప్ప, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎఫ్‌పీఓ లక్ష్మీనరసింహప్ప

అమరాపురం: మండలంలోని గ్రామైక్య సంఘంలోని సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఏపీఎం తిప్పన్న ఎఫ్‌పీఓ లక్ష్మీనరసింహప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని యానిమేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రతి సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు, రికవరీ గురించి వివరించాలన్నారు. అదే విధంగా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా చిన్న చిన్న వ్యాపారాలు, చేతి వృత్తులు తదితర వాటిని ఉపయోగించుకోవాలన్నారు. తద్వారా వచ్చిన ఆదాయంతో పొదుపు వడ్డీ చెల్లించి మిగతా సొమ్మును పిల్లల చదువుకు ఉపయోగించాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

లేపాక్షి: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ చదువుకుని చట్టాలు, హక్కులు, సమాజం, మెరుగైన జీవనోపాధి గురించి అవగాహన పెంచుకోవాలని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన లేపాక్షి ఎస్సీ కాలనీలో జరిగిన పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చదువుతో పాటు మెరుగైన జీవన విధానాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, ఆర్ఐ ప్రమీల, వీఆర్‌ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడండి

హిందూపురం: అడవులు కాలిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించినట్లు పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు తెలిపారు. దేశంలోనే అత్యంత కరువు జిల్లాగా అయిన ఉమ్మడి అనంతపురంలో ఉన్న అడవులు గత కొన్నేళ్లుగా ఏదో ఒక కారణంగా కాలిపోతూనే ఉన్నాయన్నారు. తద్వారా సహజ వనరులు నష్టపడటంతో జిల్లా ప్రజలు కరువు కాటకాలు ఎదుర్కోవలసి వస్తోందన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

పావగడ: మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేష్ జామియా మసీదును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జామియా మసీదు అభివృద్ధికి మైనార్టీ సంక్షేమ మండలి నుంచి విడుదలైన నిధుల ఖర్చు గురించి మసీదు పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా జామియా మసీదు అధ్యక్షుడు లతీఫ్ మాట్లాడుతూ మసీదుకు సీసీ రోడ్డు, చరండి, శౌచాలయం నిర్మించాలని కోరారు. 17వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ ఇమ్రాన్, 8 వ వార్డు కౌన్సిలర్ రవి, ఆర్దీ ఖాన్, షా బాబు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరయ్య సేవలు ఆదర్శనీయం



ఈఓఆర్డీ ఈశ్వరయ్య దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: ఈఓఆర్డీ ఈశ్వరయ్య సేవలు ఆదర్శనీయమని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఈఓఆర్డీ ఈశ్వరయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తాను ఎంపీడీఓ స్థాయిలో ఉన్నా ఈఓఆర్డీ ఈశ్వరయ్య చాలా విషయాల్లో తనకు ఆదర్శమన్నారు. అనంతరం ఈఓఆర్డీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ రామ్ కుమార్, సర్పంచులు తిరుమలేష్, శంకర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, మురళి, సంధ్య, బాబేనాయక్, బయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండలస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాలని కోరారు.

సౌండ్ సిస్టం వితరణ

హిందూపురం: హిందూపురం ముద్దిరెడ్డిపల్లికి చెందిన పట్టుచీరల వ్యాపారి అశ్వర్థ నారాయణ చౌడేశ్వరీకాలనీ ఎంపీ యూపీ స్కూల్‌కు సౌండ్ సిస్టంను వితరణగా అందించినట్లు హెచ్‌ఎం మధుసూదనరెడ్డి తెలిపారు.

నాణ్యమైన విద్యను బోధించాలి



హెచ్‌ఎం నరేంద్రను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. గౌడనహళ్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పీవీ నరేంద్ర ఈ మధ్యనే జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జెడ్పీటీసీ సరోజమ్మ, సర్పంచ్ పుట్టమ్మ వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్‌ఎం నరేంద్ర దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం

● పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు



మడకశిర: శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని పెనుకొండ నూతన డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం మడకశిరలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సీఐలు రాజ్ కుమార్, రామారావు నూతన డీఎస్పీకి స్వాగతం పలికారు. నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐలకు డీఎస్పీ సూచించారు.

జూదరుల అరెస్టు

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,050 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లేపాక్షిలో క్రీడాపోటీలు

లేపాక్షి: మండల కేంద్రంలోని నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో సోమవారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల నుంచి విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపండయ్యా..

అమరాపురం: మండల పరిధిలోని కె.శివరం, పేలుబండ గ్రామాలకు చెందిన 150 ఎకరాల రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు దారి చూపాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో రైతులు తహసీల్దార్ మారుతి ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు.

రొద్దం ఎస్ఐగా నరేంద్ర



రొద్దం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా కే నరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ప్రజల సహకారంలో శాంతిభద్రతలు కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎక్సైజ్ సీఐగా సృజన్‌బాబు



పెనుకొండ: పెనుకొండ ఎక్సైజ్ సీఐగా సృజన్‌బాబు నియమితులయ్యారు. కుప్పంలో పని చేస్తున్న ఆయన్ను పెనుకొండ సీఐగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి నగరికి బదిలీ అయ్యారు. అక్రమ మద్యం రవాణా అరికట్టడమే ధ్యేయంగా పని చేస్తానని నూతన సీఐ సృజన్‌బాబు తెలిపారు.

పెనుకొండ ఎస్ఐగా వెంకటేశ్వర్లు



పెనుకొండ: పెనుకొండ ఎస్ఐగా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీకే పల్లి మండలం నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. గతంలో పెనుకొండలో ఎస్ఐగా పని చేసిన వెంకటేశ్వర్లు మళ్లీ ఇక్కడికే బదిలీ కావడం విశేషం. శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎవరినీ ఉపేక్షించబోమని నూతన ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

'పురం' వన్‌టౌన్ ఎస్ఐగా శ్రీధర్



హిందూపురం అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం హిందూపురం వన్‌టౌన్ ఎస్ఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ రాజగోపాల్‌నాయుడు, డీఎస్పీ కేవీ మహేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

అగళి: మండలం ఎంపీడీఓగా యాదవేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని ఎంపీడీఓ యాదేవంద్ర పేర్కొన్నారు.

రూ. 2 లక్షల చెక్కు అందజేత

పెనుకొండ: పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా సోమవారం విజయవాడ వరద బాధితులకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. చెక్కును మంత్రి లోకేష్‌కు విజయవాడలో సోమవారం అందజేసినట్లు పీఠాధిపతి తెలిపారు.

క్రమశిక్షణతో మెలగండి

పెనుకొండ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు హఫీజ్, శివణ్ణ, మూర్తి పాల్గొన్నారు.

'వలసల నివారణలో ప్రభుత్వం విఫలం'

సోమందేపల్లి: రాష్ట్రంలో పనులు లేకా కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు విమర్శించారు. సోమవారం సోమందేపల్లిలోని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మంటపంలో నియోజకవర్గ స్థాయి భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. రమణారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. దీంతో పనులు లేకా కార్మికులు వలస వెళుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాంబశివ, రామకృష్ణ, రంగప్ప, నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

అగళి: దళితులను అవమానించినా, కులం పేరుతో వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీరేష్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మనుషులంతా ఒక్కటేనని, కులం పేరుతో దూషించడం చట్టపరంగా నేరమన్నారు. ముఖ్యంగా మానవ హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గుర్రన్న, వీఆర్‌ఓ నాగరాజు, నరసింహరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో మంగళవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పర్యటిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న జిల్లా సేల్స్ అధికారిణి శ్రీలత

గుడిబండ: మండల పరిధిలోని తిమ్మలాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఫ్యాక్ట్ అనంతపురం జిల్లా సేల్స్ అధికారిణి శ్రీలత ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీలత మాట్లాడుతూ నాటిన మొక్కలు ఎండ బెట్ట కుండా విద్యార్థులు సంరక్షించుకోవాలన్నారు.

శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ సుభద్ర

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికలో పెరిగిన కంప చెట్లను తొలగించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర వినతిపత్రం అందించారు. ప్రస్తుతం శ్మశాన వాటికలో పెద్ద ఎత్తున కంప చెట్లు పెరిగాయని పేర్కొన్నారు. దసరా పండుగ రోజు పెద్దల సమాధులకు ప్రజలు పూజలు చేయాల్సి ఉంటుందని, కంపచెట్లు తొలగించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న న్యాయవాది జయసింహ

పావగడ: అవినీతి రహిత సమాజాన్ని నిర్మించిన నాడే దేశ ప్రగతి సాధ్యమని స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయవాది జయసింహ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పీయూ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా మార్చాలన్న అబ్దుల్ కలాం కలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకుడు రఘువీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి కృషి

మడకశిర: నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ఆశాఖ నూతన డీఈ జగదీష్‌గుప్తా తెలిపారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. డీఈ మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న రోడ్లను గుర్తించి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా అంతకు ముందు ఇక్కడ డీఈగా పని చేస్తున్న శ్రీనివాస్ కర్నూలుకు బదిలీ అయ్యారు.

అభివృద్ధి ప్రణాళికపై చర్చ



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడుతూ 2047 సంవత్సరానికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏఏ సౌకర్యాలు కావాలి, ఎలాంటి పనులు చేయాలి? తదితర వాటి గురించి చర్చించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లి తండాకు చెందిన రైతు కుటుంబాన్ని మంత్రి సవిత పరామర్శించి చెక్కు అందజేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి సమీపంలో పిడుగు పడి రైతు దంపతులు దశరథ్‌నాయక్, దేవిబాయితో పాటు రెండు పాడి ఆవులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంత్రి సవిత సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి కుమారుడు జగదీష్‌నాయక్‌కు రూ.8.75 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. మంత్రి వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, గిరిజన సంక్షేమశాఖ అధికారి మోహన్‌రాం, తదితరులు ఉన్నారు.

నరసింహారెడ్డి సేవలు మరువలేనివి



నరసింహారెడ్డి దంపతులను సన్మానించిన దృశ్యం

హిందూపురం: స్థానిక ఎల్ఐసీ ఆఫీసులో 37 ఏళ్లుగా వివిధ హోదాల్లో, ఉద్యోగ సంఘం నాయకుడిగా పని చేసి హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ పొందిన కే. నరసింహారెడ్డిని ఉద్యోగులు, ఎల్ఐసీ ఏజెంట్లు ఘనంగా సత్కరించారు. స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పలువురు నరసింహారెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు.